క్లుప్తంగా

ఇతరుల పట్ల దయ, ప్రేమ గుణం కలిగి ఉండాలి



శ్రీశైలంప్రాజెక్టులో వాఖ్యోపదేశం చేస్తున్న పాస్టర్ కృపాకిరణ్

శ్రీశైలంప్రాజెక్ట్: పాపుల రక్షణ కోసం తన జీవితాన్నే ప్రజలకు బహుమానంగా ఇచ్చిన ఏసు క్రీస్తుకు మారిన నీ మనస్సుని ఇవ్వలేవా అని పాస్టర్ నందమూడి కృపాకిరణ్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆయన శ్రీశైలంప్రాజెక్ట్‌లోని ఆంధ్రాబాప్టిస్ట్ మిషన్ చర్చిలో తన వాఖ్యోపదేశాన్ని అందించారు. ప్రతిఒక్కరూ మనస్సును మార్చుకొని ఇతరుల పట్ల దయా, క్షమా, ప్రేమ గుణాలు కలిగినప్పుడే నిజమైన క్రిస్మస్ అనిఅన్నారు. ఏబీయం చర్చిలో పాస్టర్లు జనుకుటి జాన్‌బాబు, వినుకొండ మేరీ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

చర్చి పెద్దపై పోలీసుల దాడి

సాక్షి, నంద్యాల: చర్చి విషయంలో తలదూర్చి బాధితులపై దాడికి పాల్పడ్డారు పోలీసులు. దీంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. పాములపాడు మండలం వాడాల గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు జరుగుతుండగా చందాల విషయంలో చర్చి పెద్ద మనిషి వెంకటరమణతో కానిస్టేబుళ్లు రాఘవేంద్ర, ప్రతాప్, వీఆర్ కానిస్టేబుల్ మురహరి ప్రతాప్ వాదనకు దిగారు. ఇరు వర్గాల మధ్య మాటామాట పెరిగింది. కోపోద్రిక్తులైన రాఘవేంద్ర, ప్రతాప్, మురహరి ప్రతాప్ ఒక్కసారిగా వెంకటరమణతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై దాడికి దిగారు. దాడిలో వెంకటరమణ తలకు గాయం కాగా, ఆయన భార్య, కుమార్తెకు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారని, రాజీకి రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిని వివరణ కోరగా.. దాడి ఘటన వాస్తవమేనని, నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పారుమంచాలలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్సీఎం చర్చి సంఘం పెద్దలు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.15,016, రూ.12,016, రూ.8,016, రూ.5,016, రూ.3,016 చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.300ల ప్రవేశరుసుము చెల్లించి సెల్: 9849795625, 9963996065 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

వెలుగోడు: పంటలు ఎండిపోతున్నాయని అధికారులు స్పందించి సాగునీటిని విడుదల చేయాలని రేగడ గూడూరు, వాడాల, మద్దూరు, తుడిచెర్ల, బిలుకల గూడూరు, వేల్పనూరు గ్రామాలకు చెందిన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తూడిచెర్ల వద్ద ఎర్రగూడూరు లింక్ ఛానల్‌ను ముట్టడించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపం రెడ్డి, నాయకులు నందిరెడ్డి గారి రామిరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, రైతుల పాల్గొన్నారు.

దేశం మెచ్చిన నేత వాజ్‌పేయి



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్నదృశ్యం

వెలుగోడు: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి దేశం మెచ్చిన నేత అని బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రతాప్ అచారి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతిని మండల అధ్యక్షులు పోతుల రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు తిరుపాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు లబ్బి మధు, శేఖర్, శేషాద్రి, బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

ఆత్మకూరు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ నాయకులు మంజుల, లక్ష్మీదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరారు.

జూపాడుబంగ్లా: తమ డిమాండ్లు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ లీడర్లు పద్మావతి, వెంకటరమణమ్మ, ప్రసన్నలక్ష్మీ తెలిపారు. సోమవారం తమ దీక్షను కొనసాగించారు.

పాపులను రక్షించేందుకే ఏసు వచ్చెను

- అంగరంగ వైభవంగా క్రిస్మస్ సంబరాలు
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

నందికొట్కూరు: పాపులను రక్షించేందుకే ఈ లోకానికి ఏసుక్రీస్తు వచ్చారని సీఎస్ఐ టౌన్ చర్చి రెవరెండ్ ఫాదర్ నర్రా మైఖేల్ శ్యాంసుందర్ అన్నారు. సోమవారం పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రైస్తవ సోదురులు నూతన దుస్తులు ధరించి పరిశుద్ధ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో కేక్ కట్ చేసి ఏసుక్రీస్తు పుట్టిన రోజు సంబరాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడుస్తూ నీతి మంతులుగా జీవించాలన్నారు. అలాగే సీఎస్ఐ, ఏబీఎం, ఆర్‌సీఎం హోసన్న, తదతర ప్రార్థన మందిరాల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో రెవరెండ్ ఉత్తమ్‌వర, సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి బందెల జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్రబాబు, కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ కుమార్, నంద్యాల, కర్నూలు శాప్ కో ఆర్డినేటర్స్ రవికుమార్, శ్రీనాథ్, ఆర్‌సీఎం చర్చి సంఘం పెద్దలు, ఏబీఎం చర్చిలో సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. వెంకటరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓంకార్‌రెడ్డి పాల్గొని గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, ఎంపీటీసీలు సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యేసు జన్మదినం.. మానవాళికి పర్వదినం

పగిద్యాల: యేసుక్రీస్తు జన్మదినం మానవాళికి పర్వదినమని పాస్టర్లు సీఎస్. పౌల్, సావందరాజు, ఇశ్రాయేలు, కృపాకర్, యోహాను అన్నారు. సోమవారం మండలంలోని పగిడ్యాల, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర వనుములపాడు, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం తదితర గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు చేసి క్యాండిల్స్ వెలిగించి ఇంటింటికి తిరిగి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రార్థన మందిరాలకు చేరి కీర్తనలతో యేసును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో క్రీస్తు జన్మదిన వేడుకలు

జూపాడుబంగ్లా: క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని జూపాడుబంగ్లా, తాటిపాడు, తరిగోపుల, మండ్లెం, తర్తూరు, పారుమంచాల, తూడిచెర్ల, భాస్కరాపురం, 80బన్నూరు, తంగడంచ, పోతులపాడు, పి.లింగాపురం గ్రామాల్లోని ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. తెల్లవారుజామున ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో క్రీస్తు శిలువను భాజాభజంత్రీలతో ఇంటింటికి తిరిగారు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సిఎస్ఐ కొత్తపల్లి పాస్టరేట్ చైర్మన్ భరత్ కుమార్ బాబు ఎర్రమఠం, ముసలిమడుగు, శివపురం, లింగాపురం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాల చర్చిలలో ఏసుక్రీస్తు జన్మరహస్యం, అనుసరించిన జీవన విధానాలను వివరించారు. అదేవిధంగా వీరాపురం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాలలోని రోమన్ క్యాథలిక్ సంఘాల ప్రార్థన మందిరాలలో పాస్టర్ వినీత్ సామూహిక ప్రార్థనలు, క్రీస్తు పుట్టుక ప్రసంగాలు వినిపించి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.



సీఎస్ఐ చర్చిలో దేవుని వాక్యం బోధిస్తున్న రెవరెండ్ ఫాదర్ నర్రా మైఖేల్ శ్యాంసుందర్



బ్రాహ్మణకొట్కూరులో క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతోపాటు అన్ని గ్రామాల్లోని ఏబీఎం. సీఎస్ఐ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదర, సోదరీమణులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో మత గురువులు (ఫాదర్) ఏసుక్రీస్తు (ప్రభువు) సందేశాన్ని వినిపించారు.

ఆత్మకూరు: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్ని ప్రార్థనా మందిరాలో క్రైస్తవ సోదరులు అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిరిగి ఉదయం 11 గంటల నుంచి ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు క్రీస్తు బోధనలు వినిపించారు. పట్టణంలోని సీఎస్ఐ , ఏబీయం, ఎస్‌పీజీ పాలెం ,తెలుగు బాప్టిస్ట్ చర్చితో పాటూ అన్ని ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వెలుగోడు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని చర్చిల్లో తెల్లవారుజాము నుంచి ఆరాధనతో వేడుకలను ప్రారంభించారు. చర్చి పాదర్లు దైవ సందేశాన్ని అందించారు. ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ చర్చిల్లో క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివిధ ప్రతిమల రూపంలో తీర్చిదిద్దారు.



సంతజూటూరులో శిలువను మోస్తున్న క్రైస్తవులు

మైక్ సెట్ విరాళం

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మోత్కూర్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ముడిమేళ సుధాకర్ రెడ్డి ఆర్‌సీఎం చర్చికి మైకు సెట్ తో పాటు సంబంధించిన సామగ్రిని అందజేశారు. అలాగే గ్రామంలో వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

క్రీస్తు బోధనలు అనురసనీయం

మహానంది: ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా మహానంది, బండి ఆత్మకూరు మండలాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. రెండు మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలు, మజర గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవ సోదరులు ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో దైవ సందేశకులు, పాస్టర్లు దైవ సందేశం వినిపించారు.



పగిద్యాలలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సంఘ పెద్దలు, పాస్టర్ సీఎస్ పాల్



పారుమంచాలలో ప్రార్థనలు



నందికొట్కూరు సీఎస్ఐ చర్చిలో ..



మోత్కూర్‌లో మైక్ సెట్‌ను అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

క్రీడా మైదానాల పరిశీలన



జిల్లాపరిషత్ పాఠశాలలో క్రికెట్ పిచ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యే ఆడుదాం.. ఆంధ్ర పోటీలకు క్రీడా మైదానాలను వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధం చేయగా సోమవారం ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ పరిశీలించారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లకు ఆహ్వానాలు పంపారు. అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెహ్రూనగర్, పగిడ్యాల, పాత ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోటీలను ప్రారంభించేందుకు అధికారులు సన్నహాలు చేశారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, ఫీజికల్ డైరెక్టర్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహానందికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలు



మహానందికి చేరిన అక్షింతలతో ఈఓ, చైర్మన్, కార్యకర్తలు

మహానంది: జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగే రామ జన్మభూమి ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను సోమవారం మహానందికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణి వేటగాళ్లపై దాడులు ?

మహానంది: నంద్యాల జిల్లా చలమ అటవీశాఖ రేంజ్ పరిధిలో వేటకు వెళ్లిన కొందరు వన్యప్రాణి వేటగాళ్లపై అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఈ మేరకు చలమ రేంజ్ పరిధిలో వేట కోసం వెళ్లిన వారిపై అధికారులు నిఘా ఉంచారు. ఒకరిద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి వేటకు వినియోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల బండిఆత్మకూరు మండల పరిధిలోని నారపురెడ్డి కుంట సమీపంలో ఐదు మంది వేటగాళ్లను అరెస్ట్ చేసిన విషయం మరువక ముందే మరో ఘటన చోటు చేసుకుందా అంటూ నల్లమల సమీప గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానందీశ్వరుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామివార్లకు హారతిపూజలు, అలంకార పూజలు, ఉత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిగింది.

కొనసాగుతున్న భక్తజనసందడి

వరుస సెలవులు కలిసి రావడంతో పాటు ఈశ్వరుడికి ఇష్టమైన సోమవారం కావడంతో మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

మహానంది: ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బండిఆత్మకూరు మండలం లింగాపురం వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అర్జున్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన క్రీడాకారులకు తమ వంతుగా యూనిఫాం పంపిణీ చేశారు.

టీడీపీకి ప్రజలే గుణపాఠం చెబుతారు

- ఆ పార్టీలో 200 కుటుంబాలు చేరాయని తప్పుడు ప్రచారం
- ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయండి
- నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. కురుకుంద గ్రామంలో కేవలం నాలుగు కుటుంబాలు చేరితే 2 వందల కుటుంబాలు టీడీపీలో చేరినట్లు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ కనుచూపుమేరా కనిపించడం లేదని, మాజీ ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్ రెడ్డికి టికెట్ వస్తుందో లేదో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. అసలు ఆయనకే టికెట్ లేకపోగా మరో ముగ్గురు వ్యక్తులు పోటీ పడుతున్నారని చెప్పారు. టికెట్ ఇచ్చేది ఆయా పార్టీ అధ్యక్షులని, టీడీపీలో ఎవరికి స్తారో ఆపార్టీ అధ్యక్షుడికే తెలియని పరిస్థితిలో టీడీపీ కొనసాగుతోందన్నారు. తాను 39 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన అనంతరం వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారని గుర్తుచేశారు.

సీనియర్ నాయకులను అవమానించింది ఎవరు?

నారా లోకేష్ ఆత్మకూరు కు వస్తే తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుంచి ఇంత వరకూ పార్టీ మారని నేతలకు చెందిన బ్యానర్‌ను చించి అవమానించావని, నీవు పార్టీలు మారుతూ పార్టీ నాయకులను భయాందోళనలకు గురి చేస్తున్నావని, సీనియర్ నాయకులను అవమానించడం సరికాదని మాజీ ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు. వైఎస్సార్‌సీపీలో నీ నుంచి 30 ఏళ్లుగా నీ తండ్రి స్వర్గీయ బుడ్డావెంగళ రెడ్డి, నీ సోదరుడు స్వర్గీయ సీతారామరెడ్డి ఉన్నప్పటి నుంచి టీడీపీలో పనిచేసిన అప్పటి పార్టీ పట్టణ అధ్యక్షులు వరాలమాలిక్, టూరిస్ట్ గౌస్, జక్కా మురళీ, జయకృష్ణ, కృష్ణ గౌడ్, గుండు వెంకటరామిరెడ్డి, శ్రీశైలానికి చెందిన రఫి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మహిళా సంఘం నాయకురాళ్లు సుశీలబాయి, జెడ్ శ్రీనివాసరెడ్డి, బండిమాబు, ఆరవ వార్డుకు చెందిన అహ్మద్ రసూల్, ఖాసీం కుటుంబ సభ్యులు, తుమ్మలూరి అల్లీసా లాంటి ఎందరో నిన్ను వదిలి పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. మరి ఇంత మంది నీ వెంట ఉండి, మాపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరారని, నువ్వు చేర్చుకుంటున్న కార్యకర్తలందరూ అప్పటి కార్యకర్తలా కాదా అని ప్రశ్నించారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ నుంచి తన వెంట ఉన్న వారు కేవలం ఇద్దరు మాత్రమే టీడీపీలో చేరారని, అందులో సెల్ పాయింట్ రవిప్రసాద్, కరివేనకు చెందిన దినకర్ మాత్రమే అని స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ వెంట ఉన్న వారు ఎంతో మంది వైఎస్సార్‌సీపీలోకి వస్తారన్నారు. ఇటీవల జరిగిన ముస్లిం, హిందువుల గలాటకు మీ పార్టీకి చెందిన కార్యకర్త శివప్రసాద్‌రెడ్డి కారణం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యేకు హితవుపలికారు.

చెక్కుల పంపిణీ

ఇటీవలవెలుగోడు మండలానికి చెందిన సయ్యద్ అక్రమ్, వసీన్ అనే యువకులు బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారి కుటుంబసభ్యులకు కాంట్రాక్టర్ ద్వారా వసీంకు రూ.60వేలు, అక్రమ్‌కు రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే శిల్పా అందజేశారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 7న విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న గిరిజనుల శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయండి

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పాకార్తీక్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విడుదల చేశారు.

ప్రార్థనా మందిరానికి రూ.50 వేలు విరాళం

కురుకుంద గ్రామంలో సెవన్త్‌డే ఎడ్వాంటెస్ట్ ప్రార్థనా మందిర ప్రతిష్ఠకు ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్ఠాకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ముస్లింల ఆదరాభిమానం మరువలేనిది

ముస్లింల ఆదరాభిమానాలు మరువలేనివని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని పెద్ద మదరసా మదీన తుల్ ఉలూమ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, విజయచౌదరి, మొమీన్, మునీర్‌బాషా, శివశంకర్ నాయక్, ఎల్లారెడ్డి, కురుకుంద సర్పంచ్ మహబూబ్‌బీ, కోట్ల నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడలు

నందికొట్కూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను మంగళవారం పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేద్దాం

మిడుతూరు: నేటి నుంచి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సచివాలయ పరిధికి నియమించిన ప్రత్యేక అధికారుల వివరాలను ప్రకటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు క్రీడాపోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నాగలూటి సచివాలయానికి తహసీల్దార్ ప్రకాష్ బాబు, మిడుతూరు–1కి ఎంఈఓ –1 రామిరెడ్డి, మిడుతూరు –2 ఎంఈఓ–2 శ్రీనాథ్, చెరుకుచెర్ల– తిమ్మాపురం సచివాలయానికి ఏపీఓ జయంతి, తలముడిపి, అలగనూరు సచివాలయాలకు ఏపీఎం సుబ్బయ్య, కడుమూరు సచివాలయానికి పశువైద్యాధికారి సాయినాథ్ రెడ్డి, మాసపేట సచివాలయానికి డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, జలకనూరు సచివాలయానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, చౌట్కూరు సచివాలయానికి పశువైద్యాధికారి చంద్రమోహన్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు.

భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు

- ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్‌శాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్, డీఎస్పీ, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, దేవస్థానం ఈఓలతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ భక్తులరద్దీకి అనుగుణంలో క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 10 లక్షల మంది భక్తులు అధికంగా వచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అయినప్పటి నుంచి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, క్షేత్రాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. మరో 200 గదుల సముదాయం పనులను బుధవారం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చేశంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

రద్దీ రోజుల్లో అదనపు పోలీసు సిబ్బంది

రద్దీ రోజుల్లో అదనపు సిబ్బందిని నియమిస్తూ భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. శ్రీశైలానికి తెలంగాణ వైపు, ఆంధ్రావైపు ఘాట్‌రోడ్లు కలవడంతో వాహనాల సంఖ్య పెరిగినప్పుడు ట్రాఫిక్ జాం ఏర్పడుతుందన్నారు. క్షేత్రంలో వాహనాలకు ఎటువంటి ట్రాఫిక్‌జాం కావడం లేదని వివరించారు. క్షేత్ర పరిధిలో పార్కింగ్ ప్రదేశాలను పెంచాలని, ఆయా పార్కింగ్ ప్రదేశాల్లో మైకులు, సీసీ కెమెరాలు పెంచడంతో పాటు భక్తులు ఎక్కడికి ఎలా చేరుకోవాలి అనే తెలిసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించామని తెలిపారు. నందిసర్కిల్,గణేష్‌సదనం, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఏ భక్తుడూ ఇబ్బంది పడకుండా చర్యలు

ఈఓ డి పెద్దిరాజు మాట్లాడుతూ శ్రీశైలానికి విచ్చేసే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు పక్కాప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. క్షేత్రానికి వచ్చే ఏ భక్తుడూ అసౌకర్యానికి గురికాకుండా స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తిరిగి వెళ్లాలనేదే తమ ఆకాంక్ష అన్నారు. క్షేత్రపరిధిలో కూడ పార్కింగ్ ప్రదేశాలను పెంచడంతో పాటు ఏ సత్రానికి, వసతిగదులకు వెళ్లాలనుకునే వారికి అక్కడికే వెళ్లే విధంగా తగు ఏర్పాట్లు చేసుకున్నామని వివరించారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకునే విధంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేయాల్సి ఉందని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రస్తుతం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాల సంఖ్యను కూడా పెంచుతామని తెలిపారు. సమావేశంలో శ్రీశైలం సీఐ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.